క్లుప్తంగా

పీఎం స్వానిధి పథకంతో వీధి వ్యాపారులను ఆదుకోవాలి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): వీధి వ్యాపారస్తుల ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు నేటి నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ప్రధాన మంత్రి స్వానిధి యోజన పథకం క్యాంపెయిన్ నిర్వహించి వారిని ఆదుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ ఆధ్వర్యంలో నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్‌పై సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఇందులో మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ రాహుల్ కపూర్ మాట్లాడుతూ 15 రోజులపాటు జరిగే స్వానిధి యోజన క్యాంపైన్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. ఆ సూచనల మేరకు కమిషనర్ ధ్యానచంద్ర యూసీడీ విభాగం సిబ్బందికి పీఎం స్వానిధి యోజన పథకం ద్వారా వీధి వ్యాపారులకు కల్పించే రుణాల నిమిత్తం పాటించాల్సిన సోషియో ఎకనామిక్ ప్రొఫైలింగ్‌ను వివరించారు. ఈ క్యాంపైన్ గురించి ప్రతి వీధి వ్యాపారస్తుడికి, బ్యాంకులకు తెలియ జేయాలని చెప్పారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సోమవారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ఎ.బిందు యోషిత, సీహెచ్.హేమశ్రీ, కె.ఝాన్సీలక్ష్మి, తేజశ్రీ, ఎం.జయ చైత్రిక, వినీల వర్షిణి పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం నృత్యప్రదర్శన ఇచ్చిన చిన్నారులకు ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ రాయబారం

ఇంద్రకీలాద్రిపై ధర్మపథం వేదికపై పల్నాడు జిల్లా క్రోసూరు మండలం హసనాబాద్‌కు చెందిన కాశీ విశ్వేశ్వర సాంస్కృతిక సేవా సంస్థ ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్య నాటకం భక్తులకు ఆకట్టుకుంది. చింతలపాటి శూలపాణి బృందం నాటకాన్ని ప్రదర్శించారు. ఆద్యంతం ఎంతో ఆసక్తిగా సాగిన నాటకాన్ని వీక్షించిన భక్తులు కళాకారులను అభినందించారు. ఆలయ ఈవో, డీఈవోలు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

బాలల అభివృద్ధే దేశాభివృద్ధి



భవానీపురం(విజయవాడపశ్చిమ): బాలలు అన్ని రంగాల్లో రాణించి అభివృద్ధి చెందితే అది దేశాభివృద్ధికి దోహదం చేస్తుందని జువెనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ (డీపీఓ) డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అధికారి జ్యోతి అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, సంయుక్త ఫౌండేషన్, జువెనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, మహిళా శిశు సంక్షేమ శాఖ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, బర్డ్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం విద్యాధరపురం కబేళా రోడ్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహం (జువెనైల్ హోమ్)లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ బాలలకు ఏదైనా ఇబ్బంది కలిగితే వెంటనే తల్లిదండ్రులకు గానీ, పెద్దలకు గానీ లేదా చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ 100/112, ఉమెన్ హెల్ప్‌లైన్ 181 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందాలని వివరించారు. ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలు కారాదని హెచ్చరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో ఆర్డినేటర్ అరవ రమేష్, కోటే ప్రకాష్ కుమార్ చైతన్య గీతాలను ఆలపించి బాలలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో హోమ్ ఇంటెక్ ఆఫీసర్ బేగ్, జీవన్‌కుమార్, పి.విజయ్‌కుమార్, పి.సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మనోహరం....శ్రీకృష్ణ పారిజాతం నృత్య రూపకం



విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో సోమవారం ప్రదర్శించిన కూచిపూడి నృత్య రూపకం మనోహరంగా సాగింది. నాట్యాచారిణి శుభ మరువాడ నృత్యదర్శకత్వంలో కళాకారుల నటన వారి ప్రతిభకు అద్దం పట్టింది. శ్రీకృష్ణునిగా ప్రణుషారెడ్డి, సత్యభామగా అంబికా సిద్దాబత్తుల, రుక్మిణిగా ప్రణవి యెర్రనురెడ్డి, నారదునిగా సంధ్య పిరాళ్ల నటించారు. సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పి.లక్ష్మణరావు, కార్యదర్శి లలిత్ ప్రసాద్, బీవీఎస్ ప్రకాష్ పాల్గొన్నారు. కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం మూడో సోమవారం చిట్టినగర్‌లోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. కొత్త అమ్మవారి దేవస్థానంలోని కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు జరిపించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు శివాలయానికి తరలివచ్చారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి విశేష పూజలు జరిగాయి. శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వారికి ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పండ్ల రసాలు, పంచామృత అభిషేకాలతో అభిషేకించిన అనంతరం విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప, భవానీ, శివ దీక్షాపరులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. అమావాస్య రోజున స్వామి వారికి మహా కుంభాభిషేకం జరుగుతుందని, మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అర్చకులు తెలిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపం ఏర్పాటు చేయడంతో పాటు దీపార్చన నిర్వహించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు తెలిపారు.

భీమన వారి పేటలో...

భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి తెల్లవారుజాము నుంచే విశేష అభిషేకాలు నిర్వహించారు. అర్ధనారీశ్వరుడిగా శివలింగం రూపంలో దర్శనమిచ్చిన స్వామి వారికి ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాన్ని వెలిగించగా, పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. చిట్టినగర్‌లోని మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో పుట్టమన్నుతో చేసిన శివలింగానికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాద్ స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తులతో పోటెత్తిన వన్‌టౌన్ శివాలయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పవిత్రమైన కార్తిక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని పలు శివాలయాలు భక్తులతో పోటెత్తాయి.



వన్‌టౌన్ శివాలయంలో క్యూలో ఉన్న భక్తులు



శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు



వన్‌టౌన్ పాతశివాలయం వద్ద శివలింగంకు అభిషేకం చేస్తున్న అర్చకుడు

పరమశివుడిని తలచుకుంటూ భక్తులు చేసిన శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తెల్లవారుజాము నుంచి శివాలయాలన్నింటిలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లింగార్చన తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానంగా ఆయా ఆలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచి క్యూలైన్లలో బారులు తీరి కనిపించారు. ప్రధానంగా కార్తికమాసం తొలి సోమవారం కావడంతో భక్తులు భారీగా ఆయా శివాలయాలకు తరలివచ్చారు.

పాత శివాలయంలో...

వన్‌టౌన్ శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో భక్తుల తెల్లవారుజాము మూడు గంటల నుంచి పోటెత్తారు. ఆలయంలో జరుగుతున్న కార్తిక మాస నక్త దీక్షా మహోత్సవాలను పురస్కరించుకుని స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, దశ శాంతులు, సహస్ర నామార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం భక్తులు భారీగా ఆలయానికి తరలివచ్చి, కార్తిక దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. రాత్రి తొమ్మిది గంటల వరకూ ఆలయంలో రద్దీ కొనసాగింది. కార్తిక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం భ్రమరాంబ అమ్మవారు చాముండేశ్వరిదేవిగా ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉపవాసాలను పాటించి ఆలయాలకు చేరుకున్నారు. అనంతరం శివాలయంలో దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమాలను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

దర్శేశ్వరస్వామి వారి దేవస్థానంలో...

కొత్తపేటలోని శ్రీ గంగా పార్వతీ సమేత దర్శేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మురళి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం మహిళలు కార్తిక దీపాలను వెలిగించి పూజలు చేశారు. ఆలయంలోని ఉపాలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీ నగరేశ్వరస్వామి వారి దేవస్థానంలో...

పాతబస్తీలోని శ్రీ కన్యకా నగరేశ్వర, కోదండ రామాలయం (కొత్తగుళ్లు) ఆవరణలో కొలువై ఉన్న శ్రీ నగరేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారికి విశేష అభిషేకాలతో పాటుగా సహస్ర నామార్చనలను నిర్వహించారు. రుద్ర హోమంతో పాటుగా సహస్ర లింగార్చన తదితర ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకుంటున్న భక్తులు

శ్రీ గంగానమ్మ దేవస్థానంలో...

శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో కొలువై ఉన్న పరమశివునికి సోమవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సహస్ర నామార్చన, ప్రత్యేక అభిషేకాది కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తికదీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పర్యవేక్షించారు.

రామ్‌గోపాల్‌సత్రం ప్రాంగణంలో...

రామ్‌గోపాల్ సత్రం ప్రాంగణంలో ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక అర్చనలను నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. ఆలయంలో కొలువై ఉన్న ఆంజనేయస్వామివారికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్లేశ్వరునికి సహస్ర దీపార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తికమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. మల్లేశ్వర స్వామి వారికి తెల్లవారుజాము నుంచి పంచామృత అభిషేకాలు, అర్చనలను ఆలయ అర్చకులు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన జరిగింది. లింగార్చన అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించారు. సాయంత్రం మల్లేశ్వర ఆలయం, నటరాజ స్వామి వారి ఆలయం, అమ్మవారి ప్రధాన ఆలయాల్లో ఆకాశదీపాలను వెలగించారు. మరో వైపున మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద శ్రీదుర్గా మల్లేశ్వరులకు సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవలను నిర్వహించారు. ఆది దంపతులకు పూజా కార్యక్రమాల అనంతరం భక్తులు దీపాలంకరణ సేవలో పాల్గొన్నారు. కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాద పంపిణీ జరిగింది. కార్తిక సోమవారం ఉపవాస దీక్షను చేపట్టిన భక్తులు సాయం సంధ్య వేళ స్వామి వారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.



సహస్ర లింగార్చన అనంతరం విశేష అలంకరణ









కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లో... ; విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో... : కొత్త అమ్మవారి సన్నిధిలో స్వామి వారికి విశేష అలంకరణ : భీమన వారిపేటలో అన్న ప్రసాద వితరణ

అధికారుల అనాలోచిత పనులతో అవస్థలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ అధికారుల అనాలోచిత పనులతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అభివృద్ధి పనులు ఒక పద్ధతి ప్రకారం చేయాలి గాని, ఇబ్బందులకు గురి చేస్తూ ఇష్టారాజ్యంగా చేసుకుంటూ పోతే ఎలా అని భవానీపురం 42వ డివిజన్ ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని లలితానగర్ మెయిన్ రోడ్‌కు, రైతుబజార్ రోడ్‌కు అనుసంధానంగా ఉన్న టెలిఫోన్ కాలనీలోని భారతీ తీర్థనగర్ కంతంరాజు వీధిలో ఉన్న అనేక అంతర్గత రోడ్లలో నూతన కల్వర్టులు నిర్మిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఒకేసారి అన్ని అంతర్గత రోడ్లకు రెండు వైపులా ఒక సారే కల్వర్టల నిర్మాణం చేపడితే ఆయా రోడ్లలోని ప్రజలు తమ నివాసాలకు ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. తమ వాహనాలను మెయిన్ రోడ్‌లో పార్కింగ్ చేసుకుని లోపల ఉన్న ఇంటికి వెళ్లాల్సి వస్తుందని, అవి చోరీకి గురి అయినా, ఇంకా ఏదైనా జరిగినా ఎవరు బాధ్యత వహిస్తారని మండిపడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తమ వీధిలోకి అంబులెన్స్ రావాలన్నా సాధ్యంకాని విధంగా దారులు మూసేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క రహదారిలోనే నాలుగు అంతర్గత రోడ్ల ప్రారంభంలో గోతులు తవ్వేసి కల్వర్టులు నిర్మించడం సమంజసం కాదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకటి తరువాత మరొకటి నిర్మిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదని, పక్క రోడ్‌లో నుంచి ఇంటికి చేరుకునే అవకాశం ఉండేదని అంటున్నారు. కల్వర్టల నిర్మాణానికి ఉపయోగించే ఇసుక, కంకర రోడ్డుపైనే వేస్తుండటం మరో తలనొప్పిగా తయారయిందని, అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.



మెయిన్ రోడ్‌కు రెండు వైపులా అంతర్గత రోడ్ల మొదట్లో నిర్మిస్తున్న కల్వర్టులు

ప్రజా సమస్యలపై సత్వర పరిష్కారం చూపండి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఫిర్యాదుల పరిష్కార వేదికలో నగర ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదుకు స్పందించి సత్వర పరిష్కారం చూపాలని నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. నగర పరిధిలో గల వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరిస్తూ ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖాధిపతులను ఆయన ఆదేశించారు. ప్రజల నుంచి మొత్తం 16 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల నుంచి అందిన సమస్యలు పునరావృతం కాకుండా దగ్గర ఉండి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, హార్టీకల్చర్ డీడీ రామ్మోహన్, బయాలజిస్ట్ సూర్యకుమార్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.




ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

సృజనాత్మకతే విజయానికి సోపానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సృజనాత్మకతతో ముందుకు సాగినప్పుడు తప్పకుండా విజయాలు వరిస్తాయని యూనివర్సిటీ ఆఫ్ పాండిచ్చేరీ ప్రొఫెసర్, స్టార్టప్ నిపుణుడు ప్రొఫెసర్ భూషణ్ డి.సుధాకర్ అన్నారు. ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సహకారంతో కేబీఎన్ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యాన సోమవారం 'స్టార్టప్స్ – ఎ న్యూ ఇన్నోవేటివ్ బిజినెస్ వెంచర్' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన సుధాకర్ మాట్లాడుతూ ఉపాధి కల్పన, ఆవిష్కరణల ప్రోత్సాహం, పెట్టుబడుల ఆకర్షణలో స్టార్టప్‌ల పాత్ర కీలకమన్నారు. స్టార్టప్‌లు స్థానిక వనరులను సమర్థంగా ఉపయోగించి ప్రాంతీయ అభివృద్ధికి సహకరిస్తాయన్నారు. మన దేశ యువత తన మేధాశక్తిని సరైన మార్గంలో వినియోగిస్తే ప్రపంచాన్ని ఆకర్షించగల స్టార్టప్‌లు ప్రారంభించవచ్చన్నారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్ సంస్థల ఏవో డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ రవికిరణ్, అధ్యాపకురాలు వి.శైలజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చెస్ చాంపియన్‌షిప్‌లో కార్తీక్‌కు స్వర్ణం



విజయవాడస్పోర్ట్స్: రెండో ఏషియన్ చెస్ ఫర్ ప్లేయర్స్ విత్ డిజేబుల్డ్ చాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన ఫిడే మాస్టర్ వెంకటకృష్ణ కార్తీక్ సత్తా చాటాడు. కిరికిస్తాన్ దేశంలో ఈ నెల 10న ప్రారంభమైన పోటీలు సోమవారం ముగిశాయి. ఏడు దేశాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో కార్తీక్ విశేష క్రీడా నైపుణ్యంతో ఆరు పాయింట్లు సాధించి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు.

పోషకాహారంతోనే మంచి ఆరోగ్యం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): పోషకాహారంతోనే చిన్నారులు మంచి ఆరోగ్యాన్ని పొందుతారని నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ నీలం రత్నకుమార్ అన్నారు. డాన్‌బాస్కో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పెజ్జోనిపేట నీతోడు మానసిక వికాస కేంద్రంలో పోషకాహార లోపం సమస్యలు అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ నీలం రత్నకుమార్ మాట్లాడుతూ పిల్లలు చిన్న వయస్సు నుంచి మంచి ఆహారం తీసుకుంటేనే రేపటి తరం బాగుంటుందన్నారు. నూజివీడు సెమినరీ డైరెక్టర్ ఫాదర్ రాయన్న మాట్లాడుతూ రాగి పిండి, బెల్లం వంటి మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఇప్పటి తరం పిల్లలు జంక్ ఫుడ్‌కి అలవాటు పడి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. మంచి ఆహారాన్ని పిల్లలకి అలవాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ ప్రోగ్రాం మేనేజర్ వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

విధుశేఖర స్వామికి భక్తజన నీరాజనం



విధుశేఖర స్వామి ప్రసంగాన్ని వింటున్న భక్తులు

విజయవాడకల్చరల్: శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర స్వామి విజయ యాత్ర సోమవారం రెండో రోజుకు చేరుకుంది. స్వామి ఉదయం సత్యనారాయణపురంలోని పాదుకా క్షేత్రంలో జగద్గురువు ఆదిశంకరుల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మారుతీ వ్యాయామ శాలలోని ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా పార్వతీ పరమేశ్వర్లకు స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పీఠ సంప్రదాయాన్ని అనుసరించి స్వామి శారదా చంద్రమౌళీశ్వర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివరామ కృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్, జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి, గన్నవరం లలితాదిత్య, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ పాల్గొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేద పండితులు చతుర్వేదాలను గానం చేశారు.



అనుగ్రహ భాషణ చేస్తున్న విధుశేఖర స్వామి

స్వామి వారి నేటి కార్యక్రమాలు

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దర్శనం, వడ్లమన్నాటి వారి సత్రం దర్శనం, లలితా దిత్య అష్టావధాన కార్యక్రమంలో భక్తులకు విధుశేఖర స్వామి అనుగ్రహ భాషణం కార్యక్రమాల్లో పాల్గొంటారు.

• 10కే రన్ విజేత నిషాకు అభినందన

లబ్బీపేట(విజయవాడ తూర్పు): విజయ వాడ మారథాన్‌లో 10కే రన్‌లో మొదటి స్థానంలో నిలిచి రూ.5 వేలు నగదు బహుమతి పొందిన శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని నిషా షానుకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ సోమవారం అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.